క్లుప్తంగా

కార్మికుల సమస్యను విస్మరిస్తున్న ప్రభుత్వం



తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, అంకయ్య, స్టీవెన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించి నేటికి 32 ఏళ్లు అయ్యిందని.. కార్మికుల సమస్య ప్రభుత్వం విస్మరించిందని వాపోయారు. శుక్రవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీక్షా శిబిరంలో వై.సాంబశివరావు, సుభాని, ఆసిఫ్, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, టి.నాగేశ్వరరావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల చోరీలను నియంత్రించాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని ఏదో ఒక ప్రాంతంలో నిత్యం పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం ఉండవల్లి హై సెక్యూరిటీ జోన్‌లో ఉన్న పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ.. నిత్యం పోలీసుల బందోబస్తు ఉన్న పంట పొలాల్లో మోటార్లు దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం అన్నారు. ఇక్కడ విధులు నిర్వహించే పోలీసులు అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరిగేవారిని ప్రశ్నించాలని అన్నారు. అధిక పెట్టుబడితో మోటర్లను రైతులు కొనుగోలు చేస్తున్నారని.. చోరీకి గురైన వాటిని పోలీసులు వెంటనే రికవరీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై దాడి.. ఆలస్యంగా వెలుగులోకి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌పై జరిగిన దాడి ఆలస్యంగా వెలుగుచూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. తాళ్లూరి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యార్లగడ్డ నాగరాజు, అతని భార్య లక్ష్మిపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితుడి భార్య లక్ష్మి మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లో నివసించే ఓ మహిళ అసభ్యంగా మాట్లాడుతోందని ఆమె అన్నారు. దీనిపై లక్ష్మి నిలదీయగా గుంటూరు నుంచి కొందరిని పిలిపించి తమపై దాడి చేశారని పేర్కొంది. ఈ దాడిలో భర్త నాగరాజుకు ఎడమచేయి విరిగిందని తెలిపారు. సంఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని.. చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు లక్ష్మి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. రామలింగేశ్వరపేట, చినరావూరులో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగుకాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చూడాలని పలువురు కోరారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

జీవనంలో యోగా భాగం కావాలి

తెనాలి అర్బన్: యోగాను మన జీవనంలో భాగంగా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన యోగ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో పెరిగిపోతున్న వ్యర్థాలు

- భారీగా కాలువలోకి చేరుతున్న వ్యర్థాలు
- తూటికాడ తీయక ముందుకు పారని నీరు
- మృత్యువాత పడుతున్న చేపలు



గుంటూరు చానల్‌లో తూటికాడ



ఉండవల్లి లాకుల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లాలో ఎన్నో గ్రామాలు, నగర పాలక సంస్థకు తాగు నీరును అందజేసే గుంటూరు చానల్ వ్యర్థాలతో నిండిపోతుంది. వ్యర్థాలు కలిసి చానల్ నీరు కలుషితం అవ్వడంతో చానల్‌లోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. కృష్ణానది కొండవీటి వాగు ఎక్స్‌క్లూయిజ్ నుంచి గుంటూరు వరకు 47 కి.మీ. విస్తరించి ఉన్న ఈ కాలువ కింద పలు లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థకు చానల్‌కు ఇరువైపులా ఉన్న 12 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తుంది. గుంటూరు చానల్ కాలువ వల్ల 27 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు 36 గ్రామాల రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు.

కాలువలోకి మురుగు, వ్యర్థాలు..

ఈ కాలువలో నీళ్లు 365 రోజులూ పారుతూనే ఉంటాయి. చానల్‌కు కృష్ణానది నుంచి నీటిని విడుదల చేస్తారు. దీనికి అనుసంధానంగా కొండవీటి వాగు కూడా ఉండడంతో ఆ నీరు వచ్చి గుంటూరు చానల్‌లో కలుస్తోంది. కాలువ మొదటి భాగం నుంచి చివరి భాగం వరకు మురుగు నీరు వచ్చి చేరడంతో కాలువ మురుగు కూపంలా దర్శనమిస్తోంది. కాలువలో వ్యర్థాలను అధికంగా పడేయడం, తూటికాడ విపరీతంగా పెరిగిపోవడంతో ఎక్కడి నీళ్లు అక్కడే నిలబడిపోతున్నాయి. ఫలితంగా నీరు పారే అవకాశం లేక కాలువలోని నీరు పచ్చ రంగుగా మారుతుంది. తాడేపల్లి రైల్వే గేటు దాటిన తరువాత కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో గుంటూరు చానల్ నీరు పారే అవకాశం పూర్తిగా క్షీణించింది. ఆ కట్ట వేసిన వారం రోజుల్లో భారీగా వర్షాలు పడడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు, మురుగు నీరు, వ్యర్థాలు కాలువలోకే చేరుతున్నాయి.

వ్యర్థాలతో చేపలు మృత్యువాత..

రెండు మూడు రోజుల్లో కాలువలో గ్యాస్ ఫామ్ కావడంతో కాలువలోని చేపలు మృత్యువాత పడ్డాయి. గుంటూరు చానల్ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన రావడంతో ఆ ప్రాంతంలో నివసించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించాలంటే ముందు తూటాకును శుభ్రంగా తొలగించాల్సి ఉంది. తూటాకును తొలగించకపోతే రబీ సీజన్‌లో నీరు పారడం కష్టతరంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. గుంటూరు చానల్‌పై ఏర్పాటు చేసిన అడ్డుకట్టను తొలగించి మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



వ్యర్థాలు కలవడంతో మృత్యువాత పడిన చేపలు

నేడు వెన్నుపోటు దినోత్సవంపై సభ

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవంపై సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ప్రతి నియోజకవర్గంలో వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల్ని ఏ విధంగా వెన్నుపోటుకు గురి చేసిందో వివరిస్తూ ఈ సభను స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందని.. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు చిల్లపల్లి మోహనరావు, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి పాల్గొంటారని అన్నారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులు అందరూ పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఎంఆర్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

కాకుమాను: ఈ ఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు గురువారం మండల విద్యావనరుల కేంద్రానికి చేరినట్లు ఎంఈఓ కేఎఫ్ కెనడీ తెలిపారు. పాఠశాలలు ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్లకార్డులతో సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్, సింగపూర్ ఏషియా ఫౌండేషన్, రామచంద్రాపురం త్రిపాఠి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీ శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. పోలీస్ శాఖ కూడా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనంతరం పోలీస్ శాఖ రూపొందించిన ప్లకార్డులను శిక్షణ పొందుతున్న వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఎంఎస్ఎంఈ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనిబాబు, జిల్లా ట్రైనర్ రమేష్‌బాబు, త్రిపాఠి సొసైటీ కార్యదర్శి కొప్పుశెట్టి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

లాభాల ఆశ చూపి రూ.8.1 లక్షల టోకరా



32,500 నగదు పంపినట్లు వివరాలు

మంగళగిరి టౌన్: సైబర్ నేరాలపై అవగాహన లేక అమాయకులు బలైపోతున్నారు. తాజాగా ఓ వ్యక్తిని మోసగించి రూ.8.1 లక్షలు కాజేశారు. స్టాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చేలా చేస్తామని సైబర్ నేరగాళ్లు మంగళగిరి నగరానికి చెందిన ఓ వ్యక్తిని నమ్మబలికారు. మంగళగిరి పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. నగర పరిధిలోని రాజీవ్ సెంటర్‌కు చెందిన వెనిగళ్ల మధు నరేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో సీనియర్ కన్సల్టెంట్‌గా బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కరోనా తరువాత మంగళగిరి నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఇటీవల తన వాట్సాప్ నెంబర్‌కు ట్రేడింగ్ ద్వారా అధిక డబ్బులు సంపాదించుకోండి అంటూ ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌కు ఆకర్షితుడైన నరేష్ ఎలా అంటూ రిప్లయ్ ఇచ్చారు. వెంటనే ఒక టెలిగ్రామ్ లింక్‌ను వాట్సాప్‌కు పంపారు. ఆ లింక్‌లో రిజిష్టర్ అవ్వమని చెప్పారు. తెలుగులో ఒక గ్రూప్ యాడ్ చేసి వివిధ టాస్క్‌ల ద్వారా డబ్బులు సంపాదించవచ్చు అని నమ్మబలికారు. ముందుగా మీరు కొంత మనీ పే చేయాలని ఆ గ్రూప్‌లో తెలిపారు. మే 23వ తేదీన మొదటగా వారు ఇచ్చిన యూపీఐ ఐడీకి రూ.5 వేలు పంపించారు. దానికి ప్రాఫిట్‌గా రూ.7,500 చూపించారు. అదే రోజు కొత్త టాస్క్ అని చెప్పి రూ.32,500 ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.59 వేలు ప్రాఫిట్ చూపించారు. ఇలా.. టాస్క్‌ల ద్వారా రూ.8.1 లక్షలు సైబర్ నేరగాళ్లు నరేష్‌కు వల వేశారు. చివరిగా మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్‌లో నరేష్ ఫిర్యాదు చేశారు. ఘటనపై మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో నీరజ్ అనే టెలిగ్రామ్ యూజర్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శాఖమూరులో గుర్తు తెలియని మృతదేహం

నిర్మాణంలో ఉన్న కొండవీటి వాగు కాలువలో గుర్తించి కేసు నమోదు చేసిన పోలీసులు

తాడికొండ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని తుళ్ళూరు మండలం శాఖమూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న కొండవీటి వాగు కాలువలో గుర్తించినట్లు తుళ్ళూరు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం శాఖమూరు గ్రామానికి వెళ్ళే తానాపతి చెరువు వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ ఆలయం పక్కన నిర్మాణంలో ఉన్న కొండవీటి వాగు కాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు తుళ్ళూరు ఎస్ఐ కె బాబురావు తెలిపారు. మృతుడి ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకుండా పడి ఉన్నాడు. మెడలో చైన్, చేతికి ఎర్ర దారం కట్టబడి ఉంది. వయసు సుమారు 40–45 సంవత్సరాల మధ్య ఉంటుంది, అయితే ఇతను మతిస్థిమితం లేని వ్యక్తా లేక ఎవరైనా హత్యచేసి తీసుకొచ్చి పడేశారా అనే ఆధారాలు ఎలాంటివి లభ్యం కాలేదు. రాజధాని ప్రాంతంలో ఇటీవల నిర్మాణ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల సంచారం పెరిగిన నేపథ్యంలో చనిపోయింది ఎవరు అనే దానిపై ఎలాంటి ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకున్న వివాహిత చికిత్స పొందుతూ మృతి

- వరకట్నం వేధింపులే కారణమంటున్న బంధువులు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించిన మృతురాలి బంధువులు

నిడుముక్కల(తాడికొండ): వరకట్నం వేధింపులు తాళలేక ఉరివేసుకున్న వివాహిత చికిత్స పొందుతూ మరణించిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం ఎండ్రాయి గ్రామానికి చెందిన పావని(22) నిడుముక్కల గ్రామానికి చెందిన సునీల్‌తో మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. భర్త సునీల్ వరకట్నం కోసం తరచూ వేస్తుండేవాడు. అతని తండ్రి శ్రీనివాసరావు, తల్లి గీత కూడా ఇందుకు సహకరించేవారు. దీంతో మనస్తాపం చెందిన పావని ఈ నెల 24వ తేదీన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించింది. పావని తల్లి తాడిగిరి సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు. కాగా పావనికి రెండేళ్ల వయస్సు ఉన్న కవలలు ఉన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పావని బంధువులు గురువారం రోడ్డుపై బైఠాయించారు.

సమాచారం లేకుండా థియేటర్ మూసివేత

ప్రత్తిపాడు: సమాచారం లేకుండా థియేటర్‌ను ఎందుకు మూసివేశారని తహసీల్దార్ జి.కరుణ కుమార్ థియేటర్ నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఓ థియేటర్‌ను గురువారం తనిఖీ చేసేందుకు తహసీల్దార్ వెళ్లారు. అప్పటికే థియేటర్ మూసి వేసి ఉండటంతో అక్కడ ఉన్న వారిని ఆరా తీశారు. గత కొద్ది రోజులుగా తీయడం లేదని వారు తెలిపారు. దీంతో లీజుకు తీసుకున్న నిర్వాహకులకు తహసీల్దార్ ఫోన్‌లో సంప్రదించారు. నెల రోజుల నుంచే థియేటర్ తియ్యడం లేదని వారు తెలియజేశారు. వెంట సిబ్బంది ఉన్నారు.

వేధించిన రౌడీషీటర్ అరెస్ట్

తెనాలిరూరల్: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసి ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారకుడైన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గురువారం తెలియజేశారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ప్రేమిస్తున్నానంటూ వెంటబడే వాడు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. అంతేకాక ఆమెతో తనకు వివాహేతర సంబంధం ఉందని గ్రామంలో ప్రచారం చేశాడు. ఈ నేపథ్యంలో ఆమె ఏప్రిల్ నెల 4వ తేదీన పోలీసులను ఆశ్రయించగా అదే నెల 22వ తేదీన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మరుసటి రోజు 23వ తేదీన బెయిలు రావడంతో గ్రామానికి వెళ్లిన మహేష్ తనను పోలీసులు ఏమీ చేయలేకపోయారని, నీ అంతు తేలుస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన సదరు వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఏప్రిల్ 24వ తేదీన మృతి చెందింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించడంతో నరసరావుపేట సబ్‌జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: ఆటోను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన నగర పరిధిలోని కాజ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుంటూరు మీదుగా వెళుతున్న ఆటోను వెనుక నుంచి ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు యువకులను చికిత్స నిమిత్తం చినకాకానిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ కార్గో సేవలు ఉపయోగించుకోండి

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. గతంలో పార్సిల్ పంపించదలచిన వారు డిపోకు రావాల్సి ఉండేదని చెప్పారు. నూతనంగా కార్గో సేవలను బస్సుల్లో ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బస్సు కండెక్టర్‌కు పార్సిల్‌ను అందజేస్తే వారు ఆయా ప్రాంతాలకు డెలీవరీ చేసే అవకాశాన్ని ఉన్నతాధికారులు కల్పించారన్నారు. కండెక్టర్‌కు పార్సిల్ ఇవ్వగానే సెండర్, రిసీవర్ ఫోన్ నెంబర్లకు మేసేజ్‌లు కూడా పంపే ఏర్పాటు చేసామన్నా రు. జూన్ 1 నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

గొట్టిపాడులో డీఎల్‌డీవో విచారణ



ప్రత్తిపాడు: మండలంలోని పెదగొట్టిపాడులో డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) పిచ్చిరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం యానిమేటర్ శ్రీకాంతను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ అదే గ్రామానికి చెందిన కొందరు మహిళలు కొంత కాలంగా పోరాటం చేస్తున్నారు. అయినా వారి నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేకపోవడంతో కొద్ది రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణాధికారిగా డీఎల్‌డీవో పిచ్చిరెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌డీవో విచారణ నిర్వహించారు. గ్రామైఖ్య సంఘంలోని మహిళల నుంచి విడివిడిగా లిఖిత పూర్వక స్టేట్‌మెంట్లను ఆయన తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు విచారణాధికారి పిచ్చిరెడ్డి తెలిపారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు!



అల్లంవారిపాలెంలో గుంతల్లో నిలిచిన నీరు

ఫిరంగిపురం మండలం అల్లంవారిపాలెం గ్రామంలో ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇటుగా ప్రయాణించాలంటే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు పాదచారులతో పాటు ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఫిరంగిపురం నుంచి అల్లంవారిపాలెం గ్రామ శివారు వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రహదారిలో పూర్తిగా గుంతలు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం పడినా గుంతలు మొత్తం నీరు నిలిచిపోతుంది. ద్విచక్ర వాహదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలైన వారూ ఉన్నారు. రాత్రి సమయాల్లో అయితే సమస్య అధికంగా ఉంటోందని వారు వాపోతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో గుంతల్లో నీరు ఎగిసి పాదచారులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలకు తగిన మరామ్మత్తులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. - ఫిరంగిపురం

శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

మంగళగిరి టౌన్: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ తెలిపారు. రత్నాలచెరువులో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 200 నివాసాల్లో సోదాలు చేశారు. పత్రాలు సరిగా లేని, నంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంటుందని అన్నారు. రౌడీ షీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి సమయాల్లో యువత ద్విచక్రవాహనాలపై అతివేగంగా రాకపోకలు, పాఠశాల ప్రాంతాల్లో మద్యం తాగడం వంటివి స్థానికులు అడిషనల్ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అడిషనల్ ఎస్పీ రాత్రి సమయంలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, మంగళగిరి రూరల్ ఎస్ఐ మహేష్, తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్, జె.శ్రీనివాసరావు, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పగిలిన తాగునీటి పైపులైన్



మరమ్మత్తులు నిర్వహిస్తున్న పైపులైన్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గేటు సెంటర్ వద్ద పైపులైను పగలడంతో తాడేపల్లిలోని పలు ప్రాంతాలకు బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొత్తూరు ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా తాడేపల్లి పట్టణ పరిధిలోని సలామ్ సెంటర్, ముగ్గురోడ్డు, ఆర్ఎంఎస్ కాలనీ, సంజీవ్ నగర్‌లోని కొంతభాగం, లంబాడీపేట, తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ఏరియాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. నెలకు రెండు మూడు సార్లు ఇక్కడి పైపులైను పగులుతోందని.. పైపులైన్ పగిలినప్పుడల్లా తాగునీటి సమస్య ఏర్పడుతోందని స్థానికులు తెలియజేశారు. అధికారులు పైపులైన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ.. పైపులైను మరమ్మత్తులు చేపట్టామని, ప్రాంతాల వారీగా తాగు నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

తెనాలి పోలీసులపై చర్యలు తీసుకోవాలి

దుగ్గిరాల: దళిత, మైనార్టీ యువకులపై దాడి చేసిన తెనాలి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఏపీ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలిలో పోలీసులు శృతిమించి బహిరంగంగా థర్డ్ డిగ్రీ చేయడం దారుణమన్నారు. ఘటనకు పాల్పడిన వారిని వెంటనే సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేబ్రోలు పురుషోత్తం మాట్లాడుతూ.. నడిరోడ్డుపై దళిత యువకులను చిత్రహింసలు పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు.